ఇళ్లు మూసీపాలు!

గోల్నాక లంక బస్తీవాసుల్లో మొదలైన ఆందోళన

- మూసీకి అనుకుని ఉన్న ఇళ్లను మార్కింగ్ చేసిన అధికారులు
- ఇళ్లకు ఎక్కడ కూల్చేస్తారోనని నిట్టూరుస్తున్న బాధితులు
- న్యాయం చేస్తామని ప్రకటనలే తప్ప భరోసా ఇవ్వని వైనం


గోల్నాక కమాలనగర్‌లో గుమిగూడిన బాధితులు

అంబర్‌పేట: పేదలు భయాందోళనకు గురవుతున్నారు. జీవితకాలం సంపాదించి కట్టుకున్న ఇల్లు కూల్చేస్తారని వారికి కంటి మీద కునుకు లేకుండాపోతోంది.మూసీ కూల్చివేతలు హైడ్రాకు అప్పగించడంతో రెండు రోజుల నుంచి బాధితులు మరింత భయభ్రాంతులకు గురవుతున్నారు. బస్తీల్లోకి కొత్త వ్యక్తులు ఎవరొచ్చినా జంకుతున్నారు. ప్రశాంతంగా ఉన్న బస్తీల్లో హైడ్రా కూల్చివేతల వార్త పేదల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. రెక్కల కష్టంతో కట్టుకున్న చిన్న పాటి ఇళ్లు తొలగిస్తే ఎక్కడికి పోవాలని నిట్టూరుస్తున్నారు. మూసీ అభివృద్ధి కోసం అంబర్‌పేట మండల పరిధిలో మూసీకి ఆనుకొని ఉన్న గంగనగర్, కమలనగర్, లంక బస్తీలు, అంబేద్కర్‌నగర్, దుర్గనగర్ ప్రాంతాలోని పలు నివాసాలకు ప్రభుత్వం మార్కింగ్ చేసింది. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇళ్లను కూల్చేసి ప్రభుత్వం పాపం ముటగట్టుకోవద్దు అంటూ శాపనార్థాలు పెడుతున్నారు.

గందరగోళ పరిస్థితులు...

మూసీ పరీవాహక ప్రాంతాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం 10గంటలు కాగానే బస్తీల్లో అలజడి నెలకొంటోంది. అధికారులు ఎప్పుడు వస్తారో.. ఎవరు వస్తున్నారో తెలియని పరిస్థితి ఉంది. ఎవరు భరోసా ఇస్తారో తమకు న్యాయం జరుగుతుందా తెలియని పరిస్థితి. బాధితులకు నిర్దిష్టమైన భరోసా ఇచ్చే పరిస్థితులు ఇక్కడ కనబడటం లేదు. తమకు న్యాయం చేస్తామని పై స్థాయిలో ప్రకటనలు ఇస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో తమ వద్దకు వచ్చి నిర్దిష్టమైన చర్చలు, హామీ ఇవ్వలేకపోతున్నారు. కనీస జవాబుదారి ఎవరు? అనేది ప్రతి బాధితుడిని వేధిస్తున్న ప్రశ్న. ఇప్పటికైనా బస్తీల్లో గందరగోళ పరిస్థితులను చక్కదిద్దాలని పలువురు కోరుతున్నారు.

మేము ఖాళీ చేయం



30 ఏళ్లుగా ఇక్కడ ఉంటున్నాం. ఇప్పుడు కూలగొడతాం అంటే ఊరుకోం. మేము ఎక్కడికి వెళ్లాలి. మా పిల్లలు ఇక్కడే పుట్టారు. ఇక్కడే పెరిగారు. అన్ని ట్యాక్సులు కడుతున్నాం. ఇప్పుడు ఈ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందులు ఏమిటి? మాకు అన్యాయం చేయొద్దు. – నవనీత, కమలానగర్

పైసాపైసా కూడబెట్టి కట్టుకున్నాం



పైసాపైసా కూడబెట్టి చిన్నా ఇల్లు కట్టుకున్నాం. భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో ఇక్కడ ఉంటున్నాం. ఇప్పుడు ఇల్లు కూల్చేస్తాం అంటే ఎక్కడకి పోవాలి. మాకు ఈ ఇల్లే ఆధారం. ఇక్కడి నుంచి మమ్ముల్ని తరలిస్తే ఇంటితో పాటు ఉన్న ఉపాధి కూడా పోతుంది. మేమెలా బతకాలి? ప్రభుత్వం మమ్మల్ని రోడ్డు మీద పడేయొద్దు. – స్వప్న, గోల్నాక

హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చడం తగదు

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్: హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం తగదని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. తన పరిపాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాను తీసుకొచ్చారని పేర్కొన్నారు. చెరువులు, నాలాల పరిరక్షణ చేయడం మంచిదే కానీ ఆ ముసుగులో పేదలు తలదాచుకుంటున్న నివాసాలను కూల్చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. శుక్రవారం రాంనగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

మొదట పెద్దల ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

◆ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో గతంలో నిర్మించిన కట్టడాలకు ప్రభుత్వమే అనుమతి ఇచ్చిందన్నారు. ఇప్పుడు ఆ అనుమతులకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వాటి జోలికి వెళ్లడంలో రాజకీయ కోణం కనిపిస్తోందన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లను ఖాళీ చేయించి మరో ప్రాంతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తే ఇక్కడ చేసుకునే ఉపాధి పనులు అక్కడ దొరుకుతాయా అని ప్రశ్నించారు. అక్రమ కట్టడాలు, లేఅవుట్‌లు చేసిన బడా కంపెనీలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల అక్రమాలపై ముందుగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ తర్వాత పేదల ప్రాంతాల్లోకి వెళ్లి మరో ప్రాంతంలో ఆశ్రయం కల్పించాలన్నారు.

నిర్వాసితుల భయాలను తొలగించే బాధ్యత ప్రభుత్వానిదే..


గోల్నాక కమలానగర్‌లో బాధితులతో మాట్లాడుతున్న బీజేపీ నేత గౌతమ్‌రావు

అంబర్‌పేట: మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివాసిస్తున్న ప్రజలను ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తోందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం లంకబస్తీలో పార్టీ నేతలతో కలిసి పర్యటించి బాధితుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చి వేస్తామనడం అన్యాయం అన్నారు. బాధితులకు సరైన న్యాయం చేయకుండా కూల్చివేతలు చేపడితే బీజేపీ పార్టీ ప్రతిఘటిస్తుందని స్పష్టం చేశారు. పేదలపై ప్రతాపం చూపిస్తే ప్రభుత్వంపై తాము పోరాడుతామని హెచ్చరించారు. అంబర్‌పేటలో కూల్చివేతల భయాలను తొలగించే బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూల రవీందర్‌గౌడ్, రాంచందర్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరిట ఉపాధిని దెబ్బ తీయొద్దు


తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న మూసీ బాధితులు

అంబర్‌పేట: మూసీ పరీవాహక ప్రాంతాల్లో చిన్న పరిశ్రమలను నిర్వహిస్తూ ఉపాధి పొందుతూ.. ఉపాధి కల్పిస్తున్న వారిని రోడ్డున పడేయొద్దని సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అలీ కేఫ్ ప్రాంతంలో ఉన్న చిరు వ్యాపారులు, కార్మికులతో కలిసి అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆందోళన చేశారు. ఈ ఆందోళనకు అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ సైతం మద్దతు తెలిపారు. అభివృద్ధి పేరిట ఉపాధిని దెబ్బ తీయొద్దని సీపీఎం నగర్ కార్యదర్శి శ్రీనివాస్ ప్రభుత్వానికి సూచించారు. ఈ ఆందోళనలో సీపీఎం నాయకులు మహేందర్, బీఆర్ఎస్ నాయకులు లవంగం ఆంజనేయులు, లింగరావు, బాధితులు పాల్గొన్నారు.

బోలేరో వాహన డ్రైవర్‌పై కేసు నమోదు

కాచిగూడ: ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించడమే కాకుండా విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ పట్ల దురుసుగా ప్రవర్తించిన బోలేరో వాహన డ్రైవర్‌పై నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం... హిమాయత్‌నగర్ మినర్వా హోటల్ వద్ద రోడ్డుపై గోల్కొండ ప్రాంతానికి చెందిన బోలేరో వాహన డ్రైవర్ సర్వర్ (25) వాహనాన్ని నిలిపాడు. ట్రాఫిక్‌జామ్ అయి వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది కలిగించారు. బోలేరో వాహనాన్ని పక్కకు తీయాలని కానిస్టేబుల్ నర్సింహచారి, హోంగార్డు శ్రీనివాస్ సర్వర్‌కు సూచించగా తననే పక్కకు తీయాలంటావా అంటూ కానిస్టేబుల్ పట్ల దురుసుగా వ్యవహరించారు. దీంతో నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాకర్స్ క్లబ్ సభ్యత్వానికి విశేష స్పందన


సుందరయ్యపార్కులో సభ్యత నమోదును ప్రారంభిస్తున్న డిస్టిక్ గవర్నర్ శ్రీనివాసాచారి, ఆర్.వివేక్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ సభ్యత నమోదు కార్యక్రమం శుక్రవారం సుందరయ్య పార్కులో జరిగింది. క్లబ్ అధ్యక్షులు ఆర్ వివేక్, ప్రధాన కార్యదర్శి బి. వెంకటస్వామిగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 27మంది తమ సభత్వాన్ని నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిస్టిక్ గవర్నర్ డాక్టర్ శ్రీనివాసాచారి మాట్లాడుతూ... సుందరయ్యపార్కులోని వాకర్స్ ఆరోగ్య పరిరక్షణలో క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ఈ క్లబ్ సేవలను స్ఫూర్తిగా తీసుకొని ఇతరులు తమ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి. నాగభూషణం, మాజీ గవర్నర్ సంపత్ రెడ్డి, చక్రపాణి, గోవర్ధన్‌రెడ్డి, విజయలక్ష్మి, క్లబ్ మాజీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, హాస్‌ఫెడ్ డైరెక్టర్ కిషన్‌రావు, మాజీ అద్యక్షుల శైలజామోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం సాధించినప్పుడే బాపూజీకి నిజమైన నివాళి

కవాడిగూడ: కొండా లక్ష్మణ బాపూజీ స్ఫూర్తితో బహుజనులు రాజ్యాధికారం సాధించినప్పుడే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ బాపూజీ జయంతి సందర్భంగా శుక్రవారం ట్యాంక్ బండ్ జలదృశ్యం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఆయన నివాళి అర్పించారు. బాపూజీ దార్శనికత, ధైర్యాన్ని ప్రతిబింబించే విధంగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కొండ లక్ష్మణ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో ప్రచురించాలన్నారు. కొండా లక్ష్మణ బాపూజీ వంటి మహానీయుల త్యాగాలతో ఏర్పడ్డ తెలంగాణలో బడుగు బలహీన వర్గాల ప్రజలు అణచివేతకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, పీసీసీ సెక్రటరీ కోట్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రేటర్ నేత నాగేష్‌ముదిరాజ్, నాయకులు సురేష్, శంకర్, రామకృష్ణ, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కాచిగూడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అన్నారు. కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం జరిగిన హిమాయత్‌నగర్ మండల, జోనల్ స్థాయి పాఠశాలల కబడ్డి, ఖోఖో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల ఉప విద్యాధికారి విజయలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీ, పీఈటీ నాయక్, బీజేపీ నేతలు కృష్ణకుమార్, సుభాష్ పటేల్, శేర్‌సాగర్, మిలింద్ తదితరులు పాల్గొన్నారు.

అక్కినేని నాగేశ్వరరావుకు భారతరత్న ఇవ్వాలి

డాక్టర్ కేవీ రమణాచారి


పురస్కార గ్రహీతలతో డాక్టర్ కేవీ రమణాచారి, రామరాజు, శ్రీనివాసరావు తదితరులు

చిక్కడపల్లి: నటీనటులు తాము అతీతులు అని భావిస్తున్న తరుణంలో అక్కినేని నాగేశ్వర్‌రావు సాంస్కృతిక సంస్థల కార్యక్రమాలకు అతిథిగా హాజరై వారిని అభినందించి సంస్కృతి వికాసానికి దోహదం పడ్డారని డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలను శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ రమణాచారి మాట్లాడుతూ... ఏఎన్ఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ప్రముఖులకు నగదు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామరాజు, శ్రీనివాసరావు, సి.రామకృష్ణ, శ్యాంసుందర్, కొండపాక కృష్ణాచార్య, కుసుమ భోగరాజు, లంక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'జూనియర్ ఎన్టీఆర్ కటౌట్‌కు నిప్పు పెట్టలేదు'



చిక్కడపల్లి: జూనియర్ ఎన్టీఆర్ కటౌట్ తగలబడుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. శుక్రవారం జూనియర్ ఎన్టీఆర్ దేవర చిత్రం విడుదలయ్యింది. ఈ సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సుదర్శన్ 35ఎంఎంలో ఎన్టీఆర్ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఈ చిత్రం నచ్చని వారు కొంత మంది అభిమానులు ఎన్టీఆర్ కటౌట్‌ను తగల బెట్టారంటూ విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే కటౌట్‌ను ఫ్యాన్స్ తగల బెట్టలేదని అభిమానులు బాణసంచా కాల్చడంతో కటౌట్‌కు నిప్పు అంటుకుందని థియేటర్ యాజమాన్యం తెలిపింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (50) మలక్‌పేట రైల్వే స్టేషన్ ఫ్లాట్‌ఫామ్ నం.2 నుంచి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు


అడవి బాపిరాజుకు నివాళులర్పిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కళా జనార్దనామూర్తి

చిక్కడపల్లి: అడవి బాపిరాజు బహుముఖ ప్రజ్ఞాశాలి అని టీపీసీసీ ప్రచార కమిటీ కో–కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. శుక్రవారం త్యాగరాయ గానసభలో రచయిత, కళాకారుడు అడవి బాపిరాజు యాదిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వాస్తవిక దృష్టితో నవలా రచనలు చేయడంలో ఆయన సిద్ధహస్తుడని కొనియాడారు. ఆయన రచించిన గోన గన్నారెడ్డి, నారాయణరావు నవలలు పరిశోధకులకు ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. జాతీయోద్యమంలో ఆయన విస్తృతంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు వీఎస్ కళా జనార్దనా మూర్తి, వంశీ సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజు, మా అసోసియేషన్ సభ్యుడు పొత్తూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్..


మున్సిపల్ కాలనీలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

అంబర్‌పేట: ప్రజలకు అండగా ఉండేందుకు భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ ముందుంటుందని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జె.ఆనంద్‌గౌడ్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ అధిష్టానం సేవా పఖ్వాడా పేరిట 15రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చింది. పార్టీ పిలుపు మేరకు శుక్రవారం అంబర్‌పేట డివిజన్ మున్సిపల్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆనంద్‌గౌడ్ హాజరై పార్టీ నాయకులతో కలిసి ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నాగాభూషణం చారి, నాయకులు భిక్షపతి, యాదగిరి, నవీన్‌రెడ్డి, బాస్కర్‌గౌడ్, ఈశ్వర్, పెంటంరాజు, వెంకట్‌స్వామిగౌడ్, ఎస్ఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట అభివృద్ధికి సహకరించండి



అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధి సహకరించాలని ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కోరారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల ప్రాతిపదనల పత్రాలను ఆమెకు సమర్పించారు. అలాగే జరుగుతున్న అభివృద్ధి పనులను సైతం సత్వరమే పూర్తి చేయాలని కోరారు. దీనికి జీహెచ్ఎంసీ కమిషనర్ సానుకూలంగా స్పందించరన్నారు. బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు బతుకమ్మ కుంటలోని ఖాళీ స్థలంలో నీటి కొలను ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి వీహెచ్‌తో కలిసి వినతిపత్రం ఇచ్చారు. బతుకమ్మ కుంట పేరుతో ఉన్న స్థలాంలో నీటి కుంట లేదని వీహెచ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

25వేల సభ్యత్వాలే లక్ష్యంగా పనిచేయాలి


బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ తదితరులు

ముషీరాబాద్: బీజేపీ సభ్యత్వ నమోదుకు దేశ వ్యాప్తంగా మంచి స్పందన ఉందని రాజ్యసభ, సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో 25వేల సభ్యత్వాలే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. శుక్రవారం రాంనగర్‌లో బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ గడ్డం నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ప్రారంభమైన పార్టీ సభ్యత్వ నమోదుకు అన్ని వర్గాల ప్రజల నుంచి స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, రచనశ్రీ, బీజేపీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు పూస రాజు, మద్దూరి శివాజీ, రమేష్‌రామ్, భరత్‌గౌడ్, అరుణ్, నరేష్, బద్రీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా అభివృద్ధి పనుల పరిశీలన




కవాడిగూడ: ఈశ్వరమ్మ బాడలో జరుగుతున్న నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను కార్పొరేటర్ జి.రచనశ్రీ, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ శుక్రవారం వేర్వేరు సమయాల్లో పోటాపోటీగా పరిశీలించారు. వెంటనే నిర్మాణ పనులను అందుబాటులోకి తీసుకురావాలని వారు సూచించారు. కేవలం 2గంటల వ్యవధిలోనే వీరు పరిశీలనకు రావడం స్థానికంగా చర్చనీయాంశం అయ్యింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, పరిమళ్‌కుమార్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఏ.ప్రభాకర్ గంగపుత్ర, కె. ఆంజనేయులు, శివరాజ్, దిలీప్‌యాదవ్, కుమార్‌గౌడ్, బొల్ల రమేష్, బీఆర్ఎస్ కవాడిగూడ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ సాయి కృష్ణ, బస్తీ వాసులు మల్లికార్జున యాదవ్, పరుశురాం, కుమార్‌యాదవ్, సురేష్‌గౌడ్, సంతోష్, హరీష్ పాల్గొన్నారు.

అశోక్‌నగర్‌లో ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్లు పావని, రచనశ్రీ, ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠా జైసింహ, వీఎస్టీ యూనియన్ నేత వి.శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత నాగేష్ ముదిరాజ్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్







తెలంగాణ ఉద్యమసారథికి ఘన నివాళి

వాడవాడలా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

మూడు తరలా పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని వివిధ పార్టీ నేతలు, ప్రముఖులు కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం బాపూజీకి భారత రత్న ప్రకటించాలన్నారు. పద్మశాలి ప్రజా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అశోక్‌నగర్ క్రాస్‌రోడ్డులో బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎమ్మెల్సీలు ప్రొ.కోదండరాం, ఎల్.రమణ, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు పావని, రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు. అదే విధంగా జోన్ వ్యాప్తంగా జరిగిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను వివిధ పార్టీల స్థానిక నాయకులు ఆయా ప్రాంతాల్లో నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమసారథి కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని పద్మశాలి సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కె.సుదర్శన్ అన్నారు. – చిక్కడపల్లి


చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న కార్యదర్శి పద్మజ


అరుంధతినగర్‌లో ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాంను సన్మానిస్తున్న శ్రీనివాస్‌యాదవ్


జవహర్‌నగర్‌లో బాపూజీకి నివాళులర్పిస్తున్న డాక్టర్ చిక్కావేదవాసు


ముషీరాబాద్‌లో నివాళులర్పిస్తున్న పద్మశాలి నేతలు సుదర్శన్, రాజ్‌కుమార్